ఆన్‌లైన్ బెట్టింగ్ బారిన పడొద్దు

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విశాల్ ఆకుల

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 5 : యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌కు వ్యసనం కావొద్దని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ విశాల్ ఆకుల అన్నారు. నగరంలోని డ్రగ్ అండ్ డీ అడిక్షన్ సెంటర్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిణామాలపై డాక్టర్ విశాల్ వివరించారు. ఆర్థిక, వ్యక్తిగత సంక్షోభాలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో బాధపడుతున్న వారికి ప్రత్యేక చికిత్స, కౌన్సిలింగ్, పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 5 : మండలంలోని కోరట్‌పల్లి, యానంపల్లిలో పలు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సుమారు రూ.12.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాల్లో చేపడుతున్నామని, ఇందులో భాగంగా కోరట్‌పల్లి తండా, కోరట్‌పల్లి, సుద్దులం, యానంపల్లి, సాంపల్లి, సుద్దపల్లి గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు, పంచాయతీ భవనాలు, కల్వర్టులు, సొసైటీ గోదాములు తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 5 : టీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, 4 ఆధ్వర్యంలో వేసవికాల ప్రత్యేక శిబిరం కొనసాగుతున్నది. సుద్దపల్లి, సాంపల్లి, సాంపల్లి తండాలో మూడో రోజు శనివారం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ స్వప్న, డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో వలంటీర్లు సర్వే చేపట్టారు. 18-25 మధ్య వయస్సు కలిగిన యువత ఉన్నత విద్యనభ్యసించి, నిరుద్యోగులుగా ఉండడానికి గల కారణాలపై సర్వే చేపట్టినట్లు తెలిపారు. యువత సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ దిశగా అడుగులు వేయాలన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం

పాల్దాలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సారంగాపూర్, ఏప్రిల్ 5 : ప్రభుత్వ గిరిరాజ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ -4 యూనిట్ బాలుర విభాగం వలంటీర్ల ఆధ్వర్యంలో వేసవి శిబిరం కొనసాగుతున్నది. ఇందులో భాగంగా మండలంలోని పాల్దా గ్రామంలో శనివారం పలు ఆలయాల ఆవరణలో, రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ తాళ్ల నరేశ్ కుమార్ సేవా కార్యక్రమాలను పర్యవేక్షించారు. కొండూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 వలంటీర్లు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. సన్‌రైజ్ దవాఖాన వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ వెంకట్‌రావు, వలంటీర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

ధర్పల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి జగన్

ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

ధర్పల్లి, ఏప్రిల్ 5 : బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పిలుపునిచ్చారు. ఆవిర్భావ బహిరంగ సభ పార్టీ సన్నాహక సమావేశాల్లో భాగంగా ధర్పల్లి, సిరికొండ మండల కేంద్రాల్లో ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల పార్టీ నాయకులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ధర్పల్లిలో నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, మాజీ అధ్యక్షుడు నల్ల హన్మంత్‌రెడ్డి, నాయకులు పీసు రాజ్‌పాల్‌రెడ్డి, కిశోర్, మాజిద్, లింగం, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. సిరికొండలో నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తోట రాజన్న, భూషణ్, సంతోష్, రఘువాస్, రాజు, లక్ష్మీనర్సయ్య, అబ్బాస్, చందర్, కన్క శ్రీనివాస్, బుచ్చన్న, సంతోషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగ అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి

- 91 గ్రాముల బంగారు నగలు స్వాధీనం
- నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి వెల్లడి

వినాయక్‌నగర్, ఏప్రిల్ 5 : జల్సాలకు అలవాటు పడి జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని పోలీసులు అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందకు సంబంధించిన వివరాలను నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఉన్న కార్లా గ్రామానికి చెందిన నాందేవ్ ఆనంద రావు జల్సాలు చేసేందుకు చోరీలు చేసేవాడని చెప్పారు. వరుస చోరీలకు పాల్పడి, తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని మానిక్‌బండార్ వద్ద శనివారం అరెస్టు చేసినట్లు వెల్లడించారు. మార్చి 5న మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన పరశు దేవానంద్ ఇంట్లో చోరీ జరిగిందని, బాధితుడి ఫిర్యాదు మేరకు మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఆనందరావును అదుపులోకి తీసుకొని విచారించగా మాదాపూర్‌తోపాటు నందిపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐలాపూర్, వెల్మల్ గ్రామాల్లో సైతం చోరీ చేసినట్లుగా అంగీకరించాడని వెల్లడించారు. ఈ మూడు చోరీ ఘటనలకు సంబంధించి నిందితుడి నుంచి 91 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లుగా వివరించారు. సదరు నేరస్తుడు జక్రాన్‌పల్లి, బాల్కొండ, వేల్పూర్, మోర్తాడ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సైతం చోరీలు చేసి, జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. కేసును ఛేదించిన నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, మాక్లూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది రాజేశ్వర్, బాల్‌లింగం, వరప్రసాద్‌ను ఏసీపీ అభినందించారు.

విద్యాశాఖకు మంత్రిని కేటాయించని కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలి

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 5 : విద్యాశాఖకు మంత్రిని కేటాయించని కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. నాందేవ్‌వాడలోని కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి, ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం బాధాకరమన్నారు. ఓ వైపు విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పోరాటాలు నిర్వహిస్తే, మరోవైపు నిర్బంధించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు దీపిక, విఘ్నేశ్, దినేశ్, చక్రి, శివ పాల్గొన్నారు.

తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రేమ్‌లాల్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 5 : తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ టీచర్, రచయిత బానోత్ ప్రేమ్‌లాల్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ప్రేమ్‌లాల్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీశ్‌రెడ్డి తెలిపారు.

సామిల్‌లో అగ్ని ప్రమాదం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 5 : జిల్లాకేంద్రంలోని పూలాంగ్ చౌరస్తాలో ఉన్న ఓ సామిల్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. మిల్లులో ఆకస్మాత్తుగా భారీగా మంటలు చెలరేగడంతో యాజమాన్యం అగ్నిమాపక శాఖకు సమాచారం అందించింది. అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తీసుకుపచ్చారు. అప్పటికే సామిల్‌లో ఉన్న కట్టెలు, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి.

పడకల్‌లో నాలుగిండ్లలో చోరీ

- 7 తులాల బంగారం, 30 తులాల వెండి అపహరణ

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 5 : మండలంలోని పడకల్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి నాలుగిండ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలప్రకారం.. గ్రామంలోని రంగు అరవింద్, ఊట్ల నవీన్, సోమ్ నరేశ్, నడ్కుడ నర్సు ఇండ్లలో దుండగులు చోరీకి పాల్పడి సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ. 50 వేల నగదును చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, సీసీఎస్ పోలీసులు, క్లూస్‌టీం పరిశీలించి, ఆధారాలు సేకరించారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్

ఇందల్వాయి, ఏప్రిల్ 5 : మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామశివారులో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3న సబ్‌స్టేషన్‌లోకి అక్రమంగా ప్రవేశించి, శిలాఫలకం గద్దెను ధ్వంసం చేసి శిలాఫలకాన్ని ఎత్తుకెళ్లగా.. ఏఈఈ బొల్లు పండరినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. నిందితుడు తిర్మన్‌పల్లికి చెందిన మేకల క్రాంతి పట్టుకుని, కోర్టులు హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు.

మురికి గుంత.. పందుల స్వైరవిహారం

ధర్పల్లిలో పారిశుద్ధ్య నిర్వహణ కరువు

మండలకేంద్రంలోని అటవీ కార్యాలయం ఎదురుగా ఏర్పడిన మురికి నీటి గుంత

ధర్పల్లి, ఏప్రిల్ 5 : మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల పక్కన, కేజీబీవీకి వెళ్లే దారిలో పెద్ద మురికి గుంత ఏర్పడింది. దోమలు వృద్ధి చెందడంతోపాటు పందులకు నిలయంగా మురికి గుంత మారింది. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ అటవీశాఖ కార్యాలయం ఎదురుగా మురికి గుంత ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కేజీబీవీ ప్రహరీని ఆనుకొని ఉన్న మురుగు కాలువలో కూడా నీరు నిలిచి దోమలు ప్రబలుతున్నాయి. మండలకేంద్రంలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినా పంచాయతీ అధికారులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కేజీబీవీ ప్రహరీ వద్ద నిలిచిన మురికి నీరు

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

నగరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్

చందూర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం, గ్రామస్తులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 5 : భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప ప్రధానిగా, మంత్రిగా దేశ భవిష్యత్తు కోసం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు జగ్జీవన్ రామ్ అందించిన సేవలను కొనియాడారు.

జిల్లాకేంద్రంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాత అంబేద్కర్ భవన్‌లో జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పోలీస్ కమినరేట్‌లో అదనపు డీసీపీ (ఏఆర్) రామచంద్రారావు, ఎస్‌బీఐ సీఐ శ్రీశైలం.. సిబ్బందితో కలిసి జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ప్రతినిధులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కోటగిరిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. కోటగిరి ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్ హన్మంతు ఆధ్వర్యంలో, జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో అరుంధతి యూత్, మాదిగ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రుద్రూర్‌లోని ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాలలో ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ శ్రీలత ఆధ్వర్యంలో, రుద్రూర్‌లో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, అంబం గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో, డిచ్‌పల్లి మండలంలోని టీయూలో ఎస్సీ సెల్ డైరెక్టర్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. చందూర్ జీపీ కార్యాలయ ఆవరణలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు.

ఆర్మూర్‌లో దళిత సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు జగ్జీవన్ రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోర్తాడ్‌లో దళిత సంఘ నాయకులు, కమ్మర్‌పల్లి గ్రామ పంచాయతీ, కోనసముందర్‌లో ఐడీసీఎంఎస్ చైర్మన్ బదావత్ తారాచంద్‌నాయక్, మార్కెట్‌కమిటీ చైర్మన్ పాలె పునర్సయ్య, నాయకుడు సుంకెట రవి జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. రెంజల్ మండలం తాడ్‌బిలోలి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు మౌలానా, మల్ల సాయిలు తదితరులు జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బోధన్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ విఠల్, నాయకులు నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు గిర్దావర్ గంగారెడ్డి, రవీందర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాషా మొయినుద్దీన్, గుండేటి రాములు, ఎమ్మార్పీఎస్ నాయకుడు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది కమి సమ్మేళనం

- పంప సాహితీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన కవులు

కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న బోధన్ తహసీల్దార్ విఠల్

బోధన్, ఏప్రిల్ 5: పంప సాహితీ పీఠం ఆధ్వర్యంలో శనివారం బోధన్ పట్టణంలో 'ఉగాది కవి సమ్మేళనం' ఘనంగా జరిగింది. పట్టణంలోని ఉషోదయ మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ కవి సమ్మేళనానికి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని వివిధ మండలాల నుంచి కవులు, సాహితీప్రియులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉగాది కవి సమ్మేళనాన్ని ముఖ్యఅతిథిగా బోధన్ తహసీల్దార్ విఠల్ జ్యోతిని వెలిగించి ప్రారంభించగా, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిశోర్, బోధన్, కోటగిరి ఎంఈవోలు నాగయ్య, లోల శంకర్, ప్రభుత్వ మధుమలంచ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విఠల్ మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యానికి ఆదరణ తగ్గుతున్న ప్రస్తుత దశలో పంప సాహితీ పీఠంపై ఎంతో బాధ్యత ఉందని, తెలుగు సాహిత్యం అభివృద్ధికి కవులు, రచయితలు కృషిచేయాలని అన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిశోర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగు భాష, సాహిత్యంపై ఆసక్తి కలిగించేందుకు పంప సాహితీ పీఠం నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు తమ తోడ్పాటు ఉంటుందని అన్నారు.

ఉగాది కవి సమ్మేళనంకు అధ్యక్షత వహించిన పురాణే అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా తాము ఉగాది కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని, ఉమ్మడి జిల్లా కవులు, రచయితలు ఈ కవి సమ్మేళనంలో పాల్గొంటూ ఎంతో ప్రోత్సాహిస్తున్నారని అన్నారు. ఉగాది కవి సమ్మేళనాన్ని పంప సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి పబ్బ మురళి, ప్రతినిధులు కాట్రగడ్డ భారతి, ప్రభాకర్ పర్యవేక్షించారు. కవి సమ్మేళనంలో కవితలు వినిపించినవారిలో కవులు పుండరీక్ గౌడ్, ఉషకోయల సత్యనారాయణ, అమరావతి, మొగిలి స్వామిరాజ్, కేసీ లింగం, పింగళి గంగాధర్‌రావు, చెన్న శంకర్, దారం గంగాధర్, తొగర్ల సురేశ్, గంగా జమున, ఎలిగందుల లింబాద్రి, నెమ్లి సాయిలు, పీఆర్‌కే మూర్తి, పింగళి రేణుక, శంకర్‌సింగ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతమ్ దేశాయ్‌కు నివాళులు..

ఇటీవల ఆకస్మికంగా మరణించిన సీనియర్ న్యాయవాది వీఆర్ దేశాయ్ – బోధన్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతా దేశాయ్ కుమారుడు ప్రీతమ్ దేశాయ్‌కు 'ఉగాది కవి సమ్మేళనం'లో నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు కవులు, అతిథులు మౌనం వహించారు. పంప సాహితీ పీఠం కవితా సంకలనాల ప్రచురణకు ప్రీతమ్ దేశాయ్ అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి కృషి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవీపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట/ మాక్లూర్/ రెంజల్/ పొతంగల్, ఏప్రిల్ 5: మండలంలోని నవీపేట, అభంగపట్నం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారికి కేటాయించిందని తెలిపారు. మండలంలో 26 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఏమైనా ఇబ్బందులు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అభంగపట్నం ఎర్రకుంట మినీ రిజర్వాయర్‌లో మిగిలిన చిన్న మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ ఇంచార్జి ఈఈ బాల్‌రామ్‌నకు సూచించారు. అనంతరం నాగేపూర్, కోస్లీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. డీఆర్డీవో సాయాగౌడ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజారెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ కేఎల్‌వీ రాజేందర్‌కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, మోస్రా సాయరెడ్డి, మైపాల్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బుచ్చన్న, భగవాన్ తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో గుత్ప, కల్లెడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను చైర్మన్ బూర్ల అశోక్ ప్రారంభించారు. సొసైటీ ఉపాధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి ప్రవీణ్, డైరెక్టర్లు పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి, బోర్గాం, నీలా, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. తాడ్‌బిలోలి గ్రామంలో రామాలయ నూతన అధ్యక్షుడిగా గోసుల శ్రీనివాస్, డైరెక్టర్లు బి.గంగాధర్, నీరడి నరేశ్, చాకలి అబ్బయ్య, సాయమ్మతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. నీలా, తాడ్‌బిలోలి గ్రామాలకు మంజూరైన 8 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, దేవదాయ శాఖ అధికారిణి కమల, మండల నాయకులు మోబిన్‌ఖాన్, సాయిరెడ్డి, నితిన్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. పొతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ హన్మంతు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు సురేఖ, సీసీలు విఠల్, సాయిబాబా, ప్రణీత, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన జిల్లా జడ్జి

పూజ చేస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

బాల్కొండ, ఏప్రిల్ 5: జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, ఆర్మూర్ మెజిస్ట్రేట్ వేముల దీప్తితో కలిసి బాల్కొండలోని మహంకాళి మాత ఆలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయవాదులు బూస నరహరి, జగన్, గంగారాం, మాజీ సర్పంచ్ బూస సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్యం, కల్లు విక్రయాలు బంద్

శక్కర్‌నగర్, ఏప్రిల్ 5: శ్రీరామ నవమి సందర్భంగా బోధన్ ఎక్సైజ్ శాఖ పరిధిలో ఆదివారం కల్లు, మద్యం దుకాణాలు బంద్ పాటించాలని ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు దుకాణాలు మూసి ఉంచాలని, ఏడో తేదీన యథావిధిగా నడుపుకోవాలని పేర్కొన్నారు.

విహార యాత్రలతో విజ్ఞానం

బాల్కొండ, ఏప్రిల్ 5: విహార యాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని బస్సాపూర్ హెచ్ఎం డి.రాజారాం అన్నారు. బస్సాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం జిల్లాలోని ఖిల్లా రామాలయం, అంకాపూర్ వాటర్ పాల్స్, ఫన్ జోన్ తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. అక్కడి విశేషాలను ఉపాధ్యాయులు వారికి వివరించారు. ఉపాధ్యాయులు బోయడ నర్సయ్య, సాయన్న, రమాదేవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య ఆటో డ్రైవర్‌పై దాడి - కేసు నమోదు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 5: పట్టణంలోని ఆరో వార్డులో చెత్త సేకరణ ఆటో డ్రైవర్‌పై అదే వార్డుకు చెందిన ముగ్గురు దాడికి పాల్పడ్డారు. నిత్యం చెత్త సేకరణకు రావాలని తనపై దాడిచేశారని ఆటో డ్రైవర్ అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాహనాల కొరత కారణంగా నిత్యం చెత్తను సేకరించడం లేదని, ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే బల్దియా కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, డ్రైవర్‌పై దాడిచేయడం సరికాదని మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ అన్నారు. ఆటో డ్రైవర్, బల్దియా కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

నేడు ఎమ్మెల్యే వేముల పర్యటన

మోర్తాడ్, ఏప్రిల్ 5: మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ఆదివారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 9.30గంటలకు వేల్పూర్ రామాలయంలో స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.30గంటలకు పోచంపాడ్ శ్రీకోదండ రామాలయంలో నిర్వహించే స్వామి వారి కల్యాణో